సాక్షి ఒడిశా

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 4,97,507

- భువనేశ్వర్/పూరీ



గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

గిరిజనులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని రాష్ట్ర సాంఘిక భద్రత, దివ్యాంగుల సాధికారత శాఖ మంత్రి నిత్యానందో గోండొ అన్నారు.

- 8లో



ముగిసిన వికాస్ మేళా

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లోనూ నిర్వహిస్తున్న వికాస్ మేళాలు ఆదివారంతో ముగిశాయి.

- 8లో

న్యూస్‌రీల్

ప్రతిష్టాత్మకంగా హియాల్ పండగ నిర్వహణ



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

రాయగడ: నవంబర్‌లో జరగనున్న హియాల్ పండగను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని డొంబ్ సమాజం కార్యవర్గ ప్రతినిధులు తీర్మానించారు. ఆదివారం స్థానిక హోటల్లో సమాజం అధ్యక్షుడు ధనరాం నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న డొంబ్ కుటుంబాలను ఆదుకునేందుకు సంఘ సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్యదర్శి జనార్దన్ గొరడ, బాగీరథి హలువ, రామ గొరడ తదితరులు పాల్గొన్నారు.

పశువుల చోరీపై ఫిర్యాదు

రాయగడ: తమ ఉపాధికి ఆసరాగా నిలిచిన నాలుగు పశువులను గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి సనొఘొడఘాటి గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై బాధితులు రాజు కులిసిక, నాయుడు కులిసిక కళ్యాణసింగుపూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని కొందరు దుండగులు వచ్చి పికప్ వ్యాన్‌లో పశువులను ఎక్కించుకుని పరారయ్యారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్న నేపథ్యంలో పోలీసులు కేసుపై ప్రత్యేక దృష్టి సారించారు.

సీఎం హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మూడు రోజుల కెంజొహర్, మయూర్‌భంజ్ జిల్లాల పర్యటన ఆదివారంతో ముగిసింది. కెంజొహర్ నుంచి భువనేశ్వర్‌కు రోడ్డు మార్గంలో కారులో తిరిగి రావాల్సి వచ్చింది. చివరి క్షణంలో ఆయన ప్రయాణించాల్సిన హెలికాప్టరు మొరాయించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అనుబంధ వర్గాలు తెలిపాయి. హెలికాప్టరులో సాంకేతిక సమస్యతో ముఖ్యమంత్రి మయూర్‌భంజ్ జిల్లా పర్యటన రద్దయ్యింది. ఆయన గైర్హాజరులో రాష్ట్ర గృహ నిర్మాణ, నగర అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ కృష్ణచంద్ర పాత్రొ, అటవీ - పర్యావరణ శాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా పలు కార్యక్రమాల్లో పాల్గొని పథకాల్ని ప్రారంభించారు. బీజేపీ పాలన 100 రోజుల పూర్తి పురస్కరించుకుని మయూర్‌భంజ్ ఛౌ మైదానంలో బహిరంగ సభా కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొనేందుకు జిల్లా యంత్రాంగం సకల ఏర్పాట్లు చేసింది.

ముగిసిన రత్న భాండాగారం వైజ్ఞానిక సర్వే

భువనేశ్వర్:

పూరీ జగన్నాథుని రత్న భాండాగారంలోఅధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైజ్ఞానిక సర్వే ముగిసింది. నిర్దేశిత సమయం కంటే ఒక రోజు ముందుగానే ప్రక్రియ పూర్తి కావడం విశేషం. రత్న భాండాగారం లోపలి, వెలుపలి గదుల నేల, గోడల స్థితిగతుల్ని జీపీఆర్‌ఎస్ విధానంతో సర్వే నిర్వహించారు. ఈ నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ ముందుకు సాగాల్సి ఉంది. మరో 10 రోజుల్లో నివేదిక అందుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆనంద్ కిషోర్ పాండే ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు నిర్వహించి ఒక రోజు ముందుగానే సమగ్ర సర్వే ప్రక్రియను ముగించారు. నివేదికని భారత పురావస్తు శాఖ పర్యవేక్షణ నివేదిక అనుసంధానంతో సమీక్షించిన అనంతరం తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతారు.

డెంగీతో వలస కార్మికుడి మృతి

రాయగడ: డెంగీతో వలస కార్మికుడు మృతి చెందాడు. రాయగడ జిల్లా మునిగుడ సమితి అంబొదల ప్రాంతానికి చెందిన బిసం పలకియా(40) రెండేళ్ల కిందట ఉపాధి నిమిత్తం తమిళనాడు రాష్ట్రం ఎర్నాకులం వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో చేరాడు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బిసం శనివారం తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో సమీపంలోని ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ బిసం మృతి చెందాడు. మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు.

• అపచారం



రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం జగన్నాథుని ప్రతిమని ఆటబొమ్మలా నాటకంలో ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది. ప్రముఖ రంగస్థల నటుడు కన్హా స్వయి ఈ అపచారానికి పాల్పడినట్లు సాంఘిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో దుమారం రేగుతోంది. నాటకంలో జగన్నాథ స్వామి సంస్కృతిని కించపరిచే తరహాలో సంభాషణల్ని భక్తజన వర్గం వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో విచారణ జరిపి నిందితునిపై చర్యలు చేపట్టాలని కటక్ నగరం బాదంబాడి పోలీసు ఠాణాలో ఫిర్యాదు నమోదైంది. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. - భువనేశ్వర్

• తెలియాశిలా @ రూ.15,15,200



ఒడిశా, పశ్చిమ బెంగాల్ సరిహద్దు దిఘా తీరంలో షేక్ రోహిముల్ బాబా సాహెబ్ ట్రాలర్‌లో వెళ్లిన మత్స్యకారుల బృందం పంట పండింది. అరుదైన తెలియా శిలా జాతికి చెందిన 9 చేపలు వలకు చిక్కాయి. ఔషధ తయారీలో వీటికి ప్రాధాన్యం ఉండటంతో వేలం వేశారు. క్వింటా 99 కిలోగ్రాముల బరువు ఉన్న చేపలు కిలో ధర రూ.7,500 చొప్పున పలికింది. మొత్తం రూ.15,15,200 ధర లభించిందని మత్స్యకారులు తెలిపారు. - భువనేశ్వర్

• ఉల్లంఘనులను వదలం



మిమ్మల్ని ఎవరూ చూడటం లేదంటూ ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్ నడపడం, ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారా? అయితే మీకు ఫైన్ పడినట్లే. జయపురంలో ఇటీవల సీసీ కెమెరాల పర్యవేక్షణలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అక్కడి నుంచే ఉల్లంఘనులను గుర్తించి జరిమానా విధిస్తున్నారు. శనివారం ఒక్కరోజే 18 మందికి ఫైన్ విధించినట్లు పట్టణ పోలీసు అధికారి రశ్మీరంజన్ దొలాయి ఆదివారం వెల్లడించారు.

- జయపురం

- బీజేడీ, కాంగ్రెస్ కూటమిదే అధికారం
- వ్యూహరచన జరుగుతోందన్న బీజేడీ ఎంపీ దేబాశిష్
- రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఎంపీ వ్యాఖ్యలు



బీజేడీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు దేబాశిష్ సామంత్రాయ్

బీజేపీ ప్రభుత్వం.. కుప్పకూలడం ఖాయం

భువనేశ్వర్: రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లా కుజంగ్ ప్రాంతంలో జరిగిన బిజూ జనతా దళ్ పార్టీ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు దేబాశిష్ సామంత్రాయ్ ప్రసంగం రాజకీయ శిబిరాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో త్వరలోనే ఉప ఎన్నికలు జరిగే అవకాశముందని, కాంగ్రెస్‌తో కలిసి బీజేడీ కూటమి అధికారం చేపడుతుందని, ఈ మేరకు బీజేడీ శిబిరంలో వ్యూహ రచన కొనసాగుతోందని ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడం రాజకీయ పార్టీల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

ఇంకా ఏమన్నారంటే..

'రాష్ట్రంలో మోహన్‌చరణ్ మాఝి నేతృత్వంలో తొలి సారిగా పాలన పగ్గాలు చేపట్టిన బీజేపీ ప్రభుత్వం త్వరలో బలహీనపడనుంది. సభలో సంఖ్యాబలం దిగజారి తిరిగి బిజూ జనతా దళ్ అధికారంలోకి వస్తుంది. అవసరమైతే కాంగ్రెస్ కూటమితో కలిసి బీజేడీ అధికారంలోకి వచ్చే రోజులు దగ్గర పడుతుతున్నాయి. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయి. వీటి విచారణ పూర్తయితే పలువురు సభ్యులు తమ పదవులు కోల్పోయే అవకాశముంది. అధికార పక్ష భారతీయ జనతా పార్టీకి చెందిన సభ్యులకు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టులో 7, 8 కేసుల విచారణ కొనసాగుతుంది. వీటి తీర్పు త్వరలో వెలువడుతుంది. ఇప్పుడున్న అంచనా మేరకు ఉప ఎన్నిక జరిగితే తిరిగి బీజేడీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయం' అంటూ ఎంపీ దేబాశిష్ భవిష్యవాణి వల్లించడంతో అటు బీజేపీ, కాంగ్రెసు శిబిరాలతో పాటు ఇటు బిజూ జనతా దళ్ శిబిరంలో ప్రకంపన రేపింది. ఈ వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా వైరల్ కావడంతో ఎంపీ స్పందించారు. అభిప్రాయం తన వ్యక్తిగతమైనదిగా పేర్కొన్నారు. రాజకీయంలో అసాధ్యం కానిది ఏదీ లేదని మాత్రం నొక్కిచెప్పారు. ఏదేమైనా కూటమి ఇతర పార్టీపరమైన విషయాల్లో అధినేత నవీన్ పటా్నయక్‌దే తుది నిర్ణయం అని స్పష్టం చేసి సర్దుకున్నారు.

పార్టీ అభిమతం కాదు: బీజేడీ

జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ ప్రాంతం కుజంగ్ పార్టీ కార్యకర్తల సమావేశంలో దేబాశిష్ సామంత్రాయ్ వ్యాఖ్యలు బిజూ జనతా దళ్ అభిమతం కాదని పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టరు దేవీ ప్రసాద్ మిశ్రా స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయం ఏదైనా ప్రజలకు బహిరంగంగా తెలియజేస్తామని చెప్పారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయాల్లో ఎన్నో చర్చలు, ఊహాగానాలు తరచూ తెరపైకి వస్తుంటాయని తెలిపారు.



మహ్మద్ మొకీం, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే

బీజేపీ లోపాయికారీ మిత్రపక్షం బీజేడీ: కాంగ్రెస్

బీజేపీ లోపాయికారీ మిత్రపక్షంగా బిజూ జనతా దళ్ చలామణి అవుతోందని, బీజేడీ వైఖరి ఎట్టి పరిస్థితుల్లో నమ్మశక్యం కాదని కటక్ బరాబాటి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ మొకీం అన్నారు. రాష్ట్రంలో ఉప ఎన్నిక వస్తుందని దేబాశిష్ సామంత్రాయ్‌కు ముందస్తుగా ఎలా తెలిసిందని ప్రశ్నించారు. కేసులు విచారణలో ఉండగా కోర్టు వైఖరిపై ఆయన ఎలా వ్యాఖ్యానిస్తారని నిలదీశారు. కాంగ్రెస్ దక్షతతో ముందుకు సాగే ప్రాచీన రాజకీయ పార్టీ అని స్పష్టం చేశారు. పొత్తు వ్యవహారంలో విచక్షణతో సమయోచితంగా స్పందిస్తామన్నారు. దీర్ఘకాలం బీజేపీతో లోపాయికారీ మైత్రితో కొనసాగిన బీజేడీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటుందనడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు.

పగటి కలలు కంటున్నారు: బీజేపీ

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బిజూ జనతా దళ్ ప్రధాన విపక్షం హోదాలో ఇమడలేకపోయి అధికార కాంక్షతో పగటి కలలు కంటోందని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు గోలక్ మహాపాత్రో వ్యాఖ్యానించారు. ఇటువంటి గాలి కబుర్లు ప్రచారంతో పబ్బం గడుపుకోకుండా, వాస్తవ స్థితిగతుల నుంచి ఎదురీదడం అలవరచుకోవాలని హితవు పలికారు.



గోలక్ మహాపాత్రో, బీజేపీ ఉపాధ్యక్షుడు

• రేపు భువనేశ్వర్ బంద్



మాట్లాడుతున్న బీజేడీ ఉపాధ్యక్షుడు దేవీప్రసాద్ మిశ్రా

భువనేశ్వర్: భరత్‌పూర్ ఠాణా వివాదం నేపథ్యంలో ఈ నెల 24న భువనేశ్వర్‌లో ఆరు గంటలపాటు నిరవధికంగా బంద్ నిర్వహిస్తున్నట్లు బీజేడీ ఉపాధ్యక్షుడు డాక్టరు దేవీప్రసాద్ మిశ్రా ప్రకటించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనలో వాస్తవాల్ని తుంగలో తొక్కే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. నిందితులపై కఠిన చర్యలు చేపట్టే దిశగా విచారణ నిష్పక్షపాతంగా కొనసాగాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా మంగళవారం శాంతియుతంగా బంద్ నిర్వహించనున్నట్లు వివరించారు.

ప్రకృతిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక

రాయగడ: ప్రకృతి సంపదలు అంతరించిపోతుండటంతో పర్యావరణ సమతుల్యానికి విఘాతం కలుగుతోందని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక అన్నారు. స్థానిక చెక్కాగుడలోని ప్రేమ్ పహాడ్ వద్ద ఆదివారం సంబాద్ దినపత్రిక ఆధ్వర్యంలో క్లైమేట్ పంచాయితీ అనే కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ప్రకృతి సంపదలకు పుట్టినిళ్లుగా పేరొందిన మన రాష్ట్రంలో అభివృద్ధి పేరిట చెట్లు అంతరించిపోతుండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని సంరక్షించేందుకు మనమంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. పచ్చదనంగా ఉన్న ఒకప్పటి అవిభక్త కొరాపుట్ జిల్లా నేడు అంతరించిన అడవులతో బోసిపోయిందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త డాక్టర్ డి.కె.మహంతి, డాక్టర్ పి.కె.గంతాయిత్, జి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వలలో ఇద్దరు పోలీసులు

కొరాపుట్: విజిలెన్స్ వలలో ఇద్దరు పోలీసులు పట్టుబడ్డారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ శివప్రసాద్ దలయి, ప్రొబెషనరీ ఎస్ఐ రఘునాథ్ హన్సదా స్థానిక కోళ్ల పందేల శిబిరంపై దాడులు చేశారు. అక్కడ ఓ మొటార్ సైకిల్ పట్టుబడింది. దానిని వదిలి పెట్టాలని యజమాని కోరగా అందుకు రు.4000 వేలు లంచం అడిగారు. దాంతో బాధితుడు ఒడిశా అవినీతి నిరోధక శాఖ విజిలెన్స్ అధికారులను సంప్రదించాడు. వారి సూచనతో డబ్బులు ఇస్తుండగా విజిలెన్స్ అధికారులు మెరుపు దాడి చేసి పోలీసులను అదుపులోనికి తీసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి నబరంగ్‌పూర్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి తరలించారు.



శివప్రసాద్ దలయి



రఘునాథ్ హన్సదా

బాగుసలలో పులి కలకలం



బెంగాల్ టైగర్ (ఫైల్)

పర్లాకిమిడి: గజపతి జిల్లా బాగుసల గ్రామంలో పులి సంచరిస్తోందంటూ స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వారం రోజులుగా మేతకు వెళ్లిన లేగదూడలను పులి ఎత్తికెలుతోందని ఆవుల కాపరి తేజేశ్వరరావు చెబుతున్నాడు. వారం రోజులుగా 10 ఆవులు, లేగదూడలు కనిపించడం లేదని మేకల కాపరి అంతల అప్పారావు తెలిపాడు. గత ఏడాది డిసెంబరులో గుసాని సమితి గండాహాతి, కుజాసింగి ప్రాంతంలో బెంగాల్ టైగర్ పాదముద్రలను జిల్లా అటవీ అధికారులు గుర్తించారు. రాయఘడ సమితిలో మర్లబ ఘాటి, కొరడాసింగి గ్రామాల్లోనూ పులి సంచరించింది. దీంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నరాఉ. ఈ విషయమై దేవగిరి రేంజ్ ఫారెస్టర్ వెంకటరమణ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా..బాగుసలలో పులి సంచరించడం అవాస్తవమని చెప్పారు. ఇప్పటివరకూ పాదముద్రలు దొరకలేదన్నారు. ఆవులు, దూడలు కనిపించకుండా పోవడానికి వేరే జంతువులు వేటాడి ఉండవచ్చని ఆయన బదులిచ్చారు.

కరుణించమ్మా.. దండుమారెమ్మ

- దండుమాలవీధిలో తెరుచుకున్న అమ్మవారి గుడి తలుపులు
- శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం



అమ్మవారు



దోలా ట్యాంకు రోడ్డులోని దండుమారెమ్మ గుడి

పర్లాకిమిడి: స్థానిక దండుమాల వీధిలో దండుమారెమ్మ గుడి తలుపులు శుక్రవారం రాత్రి తెరిచారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఇరవై రోజుల ముందు అమ్మవారి తలుపులను పెద్దల సమక్షంలో తెరిచి దండుమారెమ్మ ఉత్సవాలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. దసరా వరకూ జరిగే దండుమారెమ్మ ఉత్సవాలను తిలకించేందుకు స్థానికులతో పాటు ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. కోర్కెలు నెరవేరినందుకు మొక్కులు తీర్చుకుంటారు.

ఏడాదికి ఒక్కసారే..

దండుమారెమ్మ గుడిలో పెద్ద నాగపుట్ట, అమ్మవారి ప్రతిమ ఉంటాయి. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా భక్తులు విశ్వసిస్తారు. ఏటా విజయదశమి పదిహేను రోజుల ముందు దండుమారెమ్మ ఉత్సవాలు ప్రారంభిస్తారు. విజయదశమి ముగియగానే అదే రోజు రాత్రి అమ్మవారి గుడితలుపులను పూజారులు పెద్దల సమక్షంలో మూసేస్తారు. తిరిగి వచ్చే విజయదశమికి ముందు గది తలుపులు తెరుస్తారు. ఏడాదికి ఒక్కసారే అమ్మవారిని కొలిచే అవకాశం ఉండటంతో భక్తులకు తప్పక వస్తుంటారు. గుడి తలుపులు తెరిచిన వెంటనే గత ఏడాది పెట్టిన కొబ్బరికాయ, దీపం వెలిగే ఉంటాయని దండుమారెమ్మ కమిటీ సభ్యులు చెబుతుంటారు. ఏడాది పూర్తయినా కొబ్బరికాయ కుళ్లిపోకుండా ఉండటం ఇక్కడి విశేషం. దసరా ఉత్సవాల ప్రారంభంలో హోమం కాల్చినపుడు అందులో కొబ్బరికాయ వేసి ప్రజలకు ప్రసాదంగా అందజేస్తారు. ఉత్సవాల నేపథ్యంలో గుడి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

న్యూస్‌రీల్

మద్యం కొరత

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం కొరత వెంటాడుతోంది. ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మద్యం గోదాం నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఈ నెల 18 నుంచి సరఫరా నిలిపివేశారు. మద్యం సరఫరా చేసే ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలకు రవాణా బకాయిలు కొన్ని నెలల నుంచి చెల్లించాల్సి ఉంది. వీరికి చెల్లించకపోవటంతో వీరు ట్రాన్స్‌పోర్టు సేవలకు దూరంగా ఉన్నారు. సోమవారం ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఇండెంట్, డిమాండ్ మేరకు తక్కువ ధరకు మద్యం సరఫరా చేస్తారా? లేదా ? అన్నది చూడాలి. మరోపక్క ప్రభుత్వం ప్రైవేట్ మద్యం విధానం అక్టోబర్ 1వ తేదీ నుంచి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో మరో ఎనిమిది రోజుల పాటు మద్యం నిలిపివేసి, ప్రైవేట్ విధానం కొనసాగించే అవకాశం ఉందని కొందరు అంటున్నారు.

దేవుడిని రాజకీయానికి వాడుకోవడం బాబుకే చెల్లింది

నరసన్నపేట: నాణ్యతలో అనుమానాలు ఉన్నాయని టీటీడీ గుర్తించి వాడకుండా నిలిపివేసిన నెయ్యిని చూపి ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపైన దుష్ప్రచారం చేస్తూ మాట్లాడడం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వాడని నెయ్యి, తయారుకాని లడ్డూలు పట్టుకొని లడ్డూ తయారీలో కొవ్వు కలిసిందని, మరేదో కలిసిందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి దిగజారి మాట్లాడుతుండటాన్ని కృష్ణదాస్ ఖండించారు. దేవుడిని రాజకీయాలకు వాడుకోవడం బాబుకే చెల్లిందన్నారు. ఇంతకుఇంత అనుభవిస్తారని అన్నారు. నిజానిజాలు తేలాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారానికి వచ్చారని, బాధ్యతలు చేపట్టి వంద రోజులు అవుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోవడంతో ప్రజలకు సమాధానాలు చెప్పలేక వారి దృష్టి మరల్చడానికి ఈ విధంగా తిరుమల దేవుడిని వినియోగించుకోవడం దారుణమన్నారు. విమర్శలు ఆపి ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ప్రయత్నించాలని కృష్ణదాస్ సూచించారు.

వైద్య రంగంపై ఎందుకంత కక్ష?

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి వైద్యారోగ్య రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 17 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయడానికి ఉపక్రమించడం, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి న ప్రభుత్వ మెడికల్ సీట్లు నిరాకరించడం, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రులు, ప్రాంతీయ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు ప్రైవేటు పరం చేయమని ఆదేశించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు ఇన్ సర్వీస్ కోటా తగ్గించడం వంటివి హేయమని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా, నెట్‌వర్క్ ఆస్పత్రులను ప్రభుత్వమే బ్లాక్ మెయిల్ చేయడం, ఆరోగ్యశ్రీని సైతం నిలుపుదల చేసి, ప్రైవేటు బీమా సంస్థలకు కట్టబెట్టడం వంటివి మానుకోవాలని హితవుపలికారు. నేరుగా వైద్యులు, వైద్య విద్యార్థుల మీద దాడి చేసి భయాందోళనలు సృష్టించడం దారుణమని పేర్కొన్నారు. దశాబ్ద కాలానికి పైగా వైద్య విద్యను అభ్యసించి, అనంతరం రాత్రి పగలు తేడా లేకుండా అనునిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న వైద్యులపై దాడులా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు దీనికి కచ్చితంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలీస్‌స్టేషన్ సాక్షిగా టీడీపీ నాయకుడి దౌర్జన్యం



కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఎదురుగా గాయాలతో మోహనరావు

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టుపురం గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాల మధ్య వివాదాలు జరు గుతున్నాయి. ఇదే విషయంపై ఇటీవల కాశీబుగ్గ గ్రీవెన్సులో ఎస్పీకి కూడా చెప్పారు. పరస్పరం ఫిర్యాదు చేసుకోగా ఆదివారం విచారణ నిమిత్తం ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. అయితే అక్కడ కూడా రెండు వర్గాల వారు గొడవపడ్డారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు బూర్లె మోహనరావుపై టీడీపీ నాయకుడు బూర్లె సూర్య కృష్ణంరాజు దాడి చేశాడు. దీనిపై ఫిర్యాదు చేయడంతో కాశీబుగ్గ పోలీసులు రెండు వర్గాల్లో 13 మందిపై కేసు నమోదు చేశారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు 28 వరకు గడువు పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్ ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 28వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. రూ.200 ఆలస్య రుసుంతో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేయించుకున్న తర్వాత వచ్చిన రిఫరెన్స్ నంబర్ ఆధారంగా ప్రవేశ ఫీ జులను అభ్యర్థులు స్వయంగా వెళ్లి ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు సమీపంలోని స్టడీ సెంటర్లకు వెళ్లి కోఆర్డినేటర్లను సంప్రదించాలని కోరారు. మధ్యలో చదువు మానేసినవారు, గృహిణులు, ఓపెన్ స్కూల్ ద్వారా విద్యాభ్యాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ తిరుమల చైతన్య సూచించారు.



వేదికపై అతిథులు

గిరిజనుల సంక్షేమమే లక్ష్యం



అభివృద్ధి మేళాను ప్రారంభిస్తున్న మంత్రి నిత్యానందో గోందొ



స్టాల్స్‌ను సందర్శిస్తున్న మంత్రి

- మంత్రి నిత్యానందో గోండొ
- మల్కన్‌గిరిలో జిల్లా స్థాయి అభివృద్ధి మేళా ప్రారంభం

మల్కన్‌గిరి: గిరిజనులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని రాష్ట్ర సాంఘిక భద్రత, దివ్యాంగుల సాధికారత శాఖ మంత్రి నిత్యానందో గోండొ అన్నారు. ఆదివారం మల్కన్‌గిరిలోని డీఎన్‌కే క్రీడా మైదానంలో సమాచార-విద్య-కమ్యూనికేషన్ ప్రోగ్రామ్, జిల్లా స్థాయి అభివృద్ధి మేళాను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమం, మహిళా ఆరోగ్యం, దివ్యాంగుల సాధికారత, వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలను వివరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైందని, కేంద్రం సహకారంతో ఒడిశాను అభివృద్ధి పథంలో నడుపుతామని చెప్పారు. అనంతరం మహిళలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



సభకు హాజరైన మహిళలు

కార్యక్రమంలో నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మాంగు ఖీలో, కలెక్టర్ ఆశిశ్‌ఈశ్వర్ పటేల్, అధికారులు పాల్గొన్నారు.

నువాఖాయి.. ఆనందమోయి..



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన



కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న అధికారులు, ప్రముఖులు

పశ్చిమ ఒడిశాలో సంప్రదాయ పండగల్లో ఒకటైన నువాఖాయి ఉత్సవాన్ని పురస్కరించుకుని రాయగడలోని బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన 'నువాఖాయి భేట్ ఘాట్' పేరిట జరిగిన కార్యక్రమం ఆద్యంతం ఆనందోత్సాహాల నడుమ సాగింది. పశ్చిమ ఒడిశా నువాఖాయి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంబల్‌పూరి నృత్యాలు, నాటక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహోరొ, వాటర్‌షెడ్ డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్, విద్యావేత్త డాక్టర్ డి.కె. మహంతి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

– రాయగడ



సంబల్‌పూరి నృత్యం



వాయిద్యాలతో అలరించిన కళాకారులు

విద్యార్థులకు పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కరణ సంక్షేమ సమాజం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మహేంద్రగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం, శాస్త్రీయ సంగీతం పోటీలు నిర్వహించారు. జిల్లా కరణ సమాజం ప్రతినిధి బిచిత్రా నంద బెబర్తా ఆధ్వర్యంలో అధ్యక్షుడు వేంకటేశ్వర పట్నాయక్, కార్యదర్శి అమిత్‌కుమార్ పట్నాయక్, అరుపాంజలి మహంతి, కోశాధికారి హరిమోహన్ పట్నాయక్, భాగవత్ పాఢి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. చిత్రలేఖనం పోటీల్లో జూనియర్ విభాగంలో ఆదర్శ మలిగాంధీ, గౌతం శోబోరో, శుభశ్రీసాహు, స్వర్ణలక్ష్మీ బెహరా.. సీనియర్ విభాగంలో ఎరిస్మిత్ మండళ్, తుంగనీ హర్ష, సుధాం శేఖర్ బిశోయి, బిశ్వజిత్ పోలాయి బహుమతులు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.



హాజరైన న్యాయనిర్ణేతలు

పరిసరాల శుభ్రత పాటిద్దాం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి

జయపురం: ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించాలని జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి అన్నారు. ఆదివారం జయపురం దసరాపొడియలో మున్సిపల్ అధికారులు నిర్వహించిన స్వచ్ఛ సేవ అభిజాన్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్వచ్ఛ-సేవ రథాన్ని ప్రారంభించారు.

అనంతరం సైకిల్ ర్యాలీ, పోటీలను జెండాఊపి ప్రారంభించారు. విద్యార్థులు, యువకులు, వృద్ధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎడ్యుకేషనల్, ఎన్విరాన్‌మెంటల్ వెల్ఫేర్ అసిషియేషన్ సభ్యులు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, సమితి బీడీఓ శక్తి మహాపాత్రో, సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకితకుమార్ వర్మ, పట్టణ పోలీసు అధికారి రశ్మీరంజన్ దొలాయి, సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి, జయపురం సబ్ డివిజన్ సమాచార, పౌర సంబంధాల అధికారి యశోద గదబ, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి రబినాయిక్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యూషకు ఏకలవ్య పురస్కారం



ప్రత్యూష రే

భువనేశ్వర్: ఈత పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రత్యూష రే ఈ ఏడాది మేటి 32వ ఏకలవ్య పురస్కారానికి ఎంపికైంది. ఈ అవార్డు కింద ఆమెకి రూ.7 లక్షల నగదు ప్రోత్సాహం లభిస్తుంది. ఏకలవ్య పురస్కార కమిటీ అధ్యక్షుడు బైజయంత్ పండా ఆదివారం ఈ విషయం ప్రకటించారు. త్వరలోనే పురస్కారం ప్రదానోత్సవం వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన సునీల్ జాని

జయపురం: అప్పర్ కొలాబ్ సాగునీటి కాలువ దారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడని జయపురం పట్టణ పోలీసు అధికారి రశ్మీరంజన్ దొలాయి ఆదివారం వెల్లడించారు. స్థానిక కుంభారి వీధికి చెందిన సునీల్ జాని(25 స్వగ్రామం నుంచి కెనాల్ రోడ్డులో బైక్‌పై జయపురం వస్తుండగా కెనాల్ రోడ్డులోని రక్షణ గోడను అదుపు తప్పి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

కళాశాలలో బాంబు పేలుడు

భువనేశ్వర్: స్థానిక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శనివారం రాత్రి బాంబు పేలుడు సంభవించింది. తొలుత హాస్టల్ సూపరింటెండెంట్‌పై దాడి చేసి ప్రత్యర్థి వర్గంపై బాంబులతో దాడికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. పాతకక్షలే ఈ ఘటనకు కారణమని భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎయిర్ ఫీల్డ్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో యాజమాన్యం సైన్ - ఎ - డై ప్రకటించింది.

ముగిసిన వికాస్ మేళా



ప్రశంసాపత్రాలతతో సంబల్‌పురి ఆదివాసీ నృత్య బృందం



లోక కళానృత్యం



మిషన్ శక్తి స్టాల్

పర్లాకిమిడి: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లోనూ వికాస్ మేళా మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. గజపతి జిల్లాలో చివరి రోజు ఆదివారం జరిగిన వికాస్ మేళా ముగింపు వేడుకలకు డి.ఆర్.డి.ఎ. సి.డి.ఎం. గుణనిధి నాయక్, జిల్లా సంక్షేమ శాఖాధికారి మనోరమా దేవి, డిప్యూటీ కలెక్టర్ లిప్పికా దాస్, డి.సి.పి.యు.అరుణ్ కుమార్ త్రిపాఠి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నృత్య కళాకారులు ప్రదర్శించిన ఒడిస్సీ, జానపద, ఆదివాసీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. నీలాంచల్ డాన్స్ అకాడమీ, ఉత్కళ బాళాశ్రమం, సంబల్‌పురి డ్యాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారిని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గుణనిధినాయక్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ సత్కరించారు.



శ్రీజగన్నాథ నృత్య అకాడమీ బాలికల జానపద నృత్యం

తండ్రిని కాపాడేందుకు మంటల్లో దూకిన చిన్నారి

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లాలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తండ్రిని కాపాడుకునేందుకు ఓ చిన్నారి మంటల్లోకి దూకింది. ఈ క్రమంలో ఇద్దరూ గాయపడటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నీలగిరి మండలం కదంబగొడి గ్రామానికి చెందిన రుషి జెనా స్థలం మీదుగా రహదారి నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. ఈ ప్రతిపాదనను రుషి వ్యతిరేకిస్తున్నాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ తన స్థలంలో రోడ్డు వేయవద్దంటూ అధికారులను వేడుకున్నాడు. అయినా అధికారులు పట్టించుకోకుండా ఆదివారం రోడ్డు నిర్మాణానికి సిద్ధపడటంతో అందరి ముందే ఒంటికి నిప్పంటించుకున్నాడు. ఈ పరిస్థితుల్లో అతని కుమార్తె తండ్రి ప్రాణాల్ని కాపాడేందుకు మంటల్లోకి దూకేసింది. తండ్రిని కాపాడబోయే ప్రయత్నంలో చిన్నారి కూడా స్వల్పంగా గాయపడింది. స్థానికులు వెంటనే రంగంలోకి దిగి తండ్రీ కుమార్తెలను రక్షించి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఓ యువకుడిని ఎక్సైజ్ అధికారులు స్థానిక రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఆదివారం జార్ఖండ్ ప్రాంతానికి చెందిన బసంతకుమార్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు.

అతని వద్ద 21.100 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ సంజయ్ ప్రధాన్ తెలిపారు.

25న చెకుముకి సైన్స్ సంబరాలు

శ్రీకాకుళం: చెకుముకి సైన్స్ సంబరాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలని ప్రజా సైన్స్ ఉద్యమ జాతీయ కమిటీ సభ్యులు జి.మురళీధర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం యూటీఎఫ్ భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక చెకుముకి సై న్స్ సంబరాల సన్నాహక సమావేశం జిల్లా అధ్య క్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ మా ట్లాడుతూ ఈ నెల 25న జిల్లాలోని 30 మండలాల్లో అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో 25 వేల మంది విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ చెకుముకి పోటీలకు ప్రధానోపాధ్యాయు లు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్.సాయి శ్రీనివాస్, రామకృష్ణ, ఏపీ జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, ఏపీ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, చెకుముకి జిల్లా కన్వీనర్ పి.కూర్మారావు, జేవీజీ గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, జనార్దనరావు, వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛతా హి సేవలో బ్యాంక్ సిబ్బంది



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంక్ సిబ్బంది

బొబ్బిలి: పట్టణంలోని యూనియన్ బ్యాంకు మేనేజర్ డి.అప్పల రాజు, రామభద్రపురం మేనేజర్ టి.సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని ఆదివారం బొబ్బిలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి ప్రాంతంలో చెత్తను ఏరివేసి పరిశుభ్రం చేశారు. అంతకుముందు బ్యాంకు బ్రాంచి కార్యాలయం నుంచి పలు రహదారుల గుండా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

వాహనం ఢీకొని బాలుడికి గాయాలు

వంగర: మండల పరిధి ఎం.సీతారాంపురం గ్రామ సమీపంలో వాహనం ఢీకొని 5వ తరగతి బాలుడికి గాయాలైనట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. వంగరలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న గురువుబిల్లి దిలీప్ కుమార్ పాఠశాల నుంచి స్వగ్రామం ఎం.సీతారాంపురం వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. దీంతో బాలుడిని ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన మరడాన శివ

రాజాం సిటీ: వ్యాపారం చేసి జీవితంలో స్థిరపడాలన్న ఆ యువకుడి ఆశలు అడియాశలయ్యాయి. చేస్తున్న వ్యాపారంలో కొద్ది రోజుల్లోనే నష్టాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజాం మండలంలోని మొగిలివలస సమీపంలోని తోటలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన మరడాన శివ (31) వ్యాపారం నిమిత్తం రాజాం వచ్చాడు. 20 రోజుల క్రితం టిఫిన్ దుకాణం ప్రారంభించాడు. కొద్ది రోజుల్లోనే ప్రారంభించిన వ్యాపారంలో నష్టం వచ్చింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 21 రాత్రి మండల పరిధి మొగిలివలస గ్రామ సమీపంలోని టేకు తోటలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన కొంతమంది గమనించి పోలీసులకు ఈ సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటనపై ఆరా తీసి మృతుడిని ఉద్దవోలు గ్రామవాసిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి మరడాన శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హుండీ చోరీకేసులో నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక అయ్యన్నపేటలో ఉన్న చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ హుండీలను చోరీ చేసిన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, చోరీ సొత్తు రికవరీ చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20న చోరీ జరిగినట్లు ఆలయ అర్చకుడు శ్రీనివాస శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ద్వారపూడి ఎస్సీ కాలనీకి చెందిన బెల్లాన బాలరాజును పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆలయంలోని రెండు హుండీల్లో చోరీచేసిన మొత్తం నగదు రూ. 30వేలతో కొనుగోలు చేసిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ చెప్పారు.

విద్యుత్ శాఖకు షాక్..!

- ట్రాన్స్‌ఫార్మర్‌లే దొంగల టార్గెట్
- చోరీకి గురైన వాటి విలువ సుమారు రూ.1.80 కోట్లు



విజయనగరం మండలంలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్



డెంకాడ మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైన స్థలం

విజయనగరం ఫోర్ట్: విజయనగరం మండలంలోని కొండకరకాం జంక్షన్‌లో ఓ స్థలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాత్రి వేళ దుండగులు ఎత్తుకెళ్లిపోయారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.2.50 లక్షల వరకు ఉంటుంది.

- విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలో పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాత్రివేళ దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. ఈ ట్రాన్సఫార్మర్ విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది.
- నెల్లిమర్ల మండలంలో పొలంలో చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది. ఈ మూడు ట్రాన్స్‌ఫార్మర్లే కాదు. జిల్లాలోని అనేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రాత్రివేళ దుండగులు ఎత్తుకుపోతూ విద్యుత్ శాఖకు షాక్ ఇస్తున్నారు. జిల్లాలో ఎక్కడో ఓ చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురవుతోంది. ఓ విధంగా చెప్పాలంటే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను దుండగులు టార్గెట్ చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను చోరీ చేసేందుకు ఓ గ్యాంగ్ జిల్లాలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ గ్యాంగ్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తూ ఆ శాఖ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

విద్యుత్ గురించి తెలిసిన వారే చోరీ

విద్యుత్ గురించి బాగా తెలిసిన వారే చోరీకి పాల్పడుతున్నరనే విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎందుకంటే హెచ్‌టీ లైన్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ముట్టుకుంటే షాక్‌కు గురై చనిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి విద్యుత్ గురించి తెలియని వారు చోరీకి పాల్పడే అవకాశం లేదేని విద్యుత్ షాక్‌కు గురికాకుండా ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేయాలంటే విద్యుత్ గురించి పూర్తిస్థాయిలో తెలిసిన వారైతేనే అవకాశం ఉంటుందని అంటున్నారు.

5నెలల్లో 59 ట్రాన్స్‌ఫార్మర్లు మాయం

జిల్లాలో గడిచిన ఐదు నెలల్లో 59 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ.2.50 లక్షలు నుంచి రూ. 3 లక్షల వరకు ఉంటుంది. ఇప్పటివరకు చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల విలువ సుమారు రూ.1.80 కోట్ల వరకు ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే రాగి వైరు కోసం లక్షలు విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తున్నారు. రాగి వైరు విలువ రూ.10 వేలు ఉంటుంది. దాని కోసం రూ.రెండు, మూడు లక్షలు విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకుపోతున్నారు.

ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 17 వరకు చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు

మండలం	ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య
బొబ్బిలి డి-2	1
బొండపల్లి	2
గజపతినగరం	1
పాచిపెంట	1
డెంకాడ	9
పూసపాటిరేగ	7
ఆర్.ఆముదాలవలస	2
జామి	3
ఎస్.కోట	1
డి-4 విజయనగరం	10
గంట్యాడ	2
గుర్ల	4
నెల్లిమర్ల	16

ఫిర్యాదు చేస్తున్నాం

విద్యుత్ ట్రాన్సఫార్మర్లు చోరీకి గురైన మాట వాస్తవమే. సంబంధిత ఏఈల ద్వారా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నాం.

– ముివ్వల లక్ష్మణరావు, ఎస్ఈ, ఈపీడీసీఎల్

తిరుపతి లడ్డూపై సీబీఐ దర్యాప్తు చేయించాలి

- మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు చేస్తున్న ఆరోపణలపై తక్షణమే సీబీఐతో విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన సాలూరులోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు కొలిచే తిరుపతి దేవస్థానానికి ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా ఈ ఆరోపణలు చేశారని విమర్శించారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా నీచపు రాజకీయాలకు టీడీపీ కూటమి ప్రభుత్వ పెద్దలు తెరలేపారని మండిపడ్డారు. లడ్డూ నాణ్యతపై జూలై నెలలో తెలిస్తే, ఈ ప్రభుత్వం ఇప్పటివరకు గోప్యంగా ఉంచడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి సీబీఐ లేదా సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి కూటమి ప్రభుత్వం తన సచ్ఛీలతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో విచారణ జరిపి తిరుమల పవిత్రతను కాపాడాలని ప్రధానమంత్రికి ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాశారని తెలియజేశారు.

బొగ్గు లోడులో మృతదేహం

- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



బొగ్గులోడులో వచ్చిన గుర్తు తెలియని మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ షణ్ముఖరావు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామం సమీపంలో గల శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కర్మాగారానికి లారీలో వచ్చిన బొగ్గు లోడులో గుర్తు తెలియని యువకుడి (30) మృతదేహం ఆదివారం కనిపించింది. ఈ ఘటనపై సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్మాగారానికి ఒడిశా రాష్ట్రంలోని కటక్ నుంచి లారీల్లో బొగ్గును తెప్పిస్తారు. ఈ క్రమంలో ఆదివారం వచ్చిన ఒక లారీ లోడులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వచ్చింది. లారీలోని బొగ్గును అన్‌లోడ్ చేసి జేసీబీతో ఆ బొగ్గును లెవెల్ చేస్తున్న క్రమంలో మృతదేహాన్ని జేసీబీ ఆపరేటర్ గుర్తించాడు. వెంటనే కర్మాగారం ప్రతినిధి సన్యాసిరావుకు తెలియజేయగా ఆయన కొత్తవలస పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ షణ్ముఖరావు సిబ్బందితో కలిసి కర్మాగారానికి వచ్చి పరిశీలించారు. అనంతరం మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేపల వర్తకులపై ఆకస్మిక దాడులు



చేపల వర్తకులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లలో విక్రయిస్తున్న చేపలు, చికెన్, మటన్ వర్తకులపై ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికరాళ్లతో వినియోగదారులను మోసం చేస్తున్న పరిస్థితిని ఈ సందర్భంగా గుర్తించి ఐదుగురు చేపల వర్తకులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. మరో మారు ఇలా చేసినట్లయితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవడంతో పాటు అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందని వర్తకులను హెచ్చరించామని చెప్పారు. అలాగే వినియోగదారులు కూడా ఇటువంటి మోసాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి మోసాలు జిల్లాలో ఎక్కడైనా జరిగినట్లయితే తమ దృష్టికి తీసుకురావచ్చని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో శాఖాపరమైన సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని గిరిజనుడి మృతి..



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు



చెరువులో తేలుతున్న చనిపోయిన చేపలు

పాచిపెంట: మండలంలోని కోటికిపెంట పంచాయతీ గోగాడవలస సమీపంలో లారీ ఢీకొని ఓ గిరిజనుడు మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోగాడవలస గ్రామానికి చెందిన కొటపోలి రాజు(37) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు, ఎప్పటిలాగానే శనివారం కూలి పనులకు వెళ్లి ముగించుకుని రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి సంబంధించిన ఓ లారీ వెనకనుంచి ఢీ కొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో పోలిరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ ఆదివారం తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

కుక్కల దాడిలో 23 గొర్రె పిల్లలు..

గుర్ల: మండలంలోని చోడవరంలో వీధి కుక్కల దాడిలో 23 గొర్రె పిల్లలు మృతిచెందాయి. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన నక్క చిన్నయ్య తన నివాసం ముందు గొర్రె పిల్లలను ఉంచాడు. ఒక్కసారిగా వీధి కుక్కలు వాటిపై దాడి చేయగా గొర్రెపిల్లలన్నీ తీవ్రగాయాల పాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాయని చిన్నయ్య లబోదిబోమన్నాడు.

చెరువులో చేపలు..

బొబ్బిలిరూరల్: మండలంలోని కాశిందొరవలస గ్రామంలో గల కొత్తపోలమ్మ చెరువులో పెరుగుతున్న చేపలు ఆదివారం మృతిచెందాయి. చెరువులో చేపలు మృతి చెంది తేలుతుండడంతో విషయం తెలుసుకున్న చేపల పెంపకం దారులు చంద్రినాయుడు, తౌడు, ఎరం దొరలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు లక్షరూపాయల విలువైన టన్ను చేపలు మృతిచెందాయని వారు తెలిపారు. గిట్టని వారు ఎవరైనా విషప్రయోగం చేశారా? అన్న విషయం తేలాల్సి ఉందని, తాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని చేపల మృతితో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అబ్బ నీ పుల్లని 'దబ్బ'

- 600 ఎకరాల్లో సాగు
- దిగుబడి పెరిగింది..ధర తగ్గింది
- కేరళ, ఒడిశా రాష్ట్రాలకు పుల్లదబ్బ ఎగుమతి
- పచ్చళ్లు, జ్యూస్‌ల తయారీకి వినియోగం



వ్యాపారులు కొనుగోలు చేసిన దబ్బ



వ్యాన్‌లో పంటను ఎక్కించుకుని వెళ్తున్న దృశ్యం

సీతంపేట: ఈ సీజన్‌లో సీతంపేట, భామిని ఏజెన్సీలో లభ్యమయ్యే పుల్లదబ్బకు కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో భారీగా డిమాండ్ ఉంది. కేరళలో ఓనం పండగ జరగుతుండడంతో అక్కడ వినియోగం ఎక్కువగా ఉంటుంది. అయితే ఏజెన్సీలో ఈ ఏడాది దిగుబడి పెరిగినప్పటికీ ధరలు అంతగా అనుకూలించడం లేదని రైతులు వాపోతున్నారు. అంతగా పెట్టుబడులు అక్కర్లేక పోవడంతో ఏజెన్సీలో సుమారు 600 ఎకరాల వరకు పంటను కొండపోడు వ్యవసాయంలో దబ్బ పంటను పండిస్తారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తోందని గిరిజన రైతులు వాపోతున్నారు. కావిడ పుల్ల దబ్బను రూ.200 నుంచి రూ. 300 వరకు విక్రయిస్తున్నామని గిరిజనులు తెలిపారు. వ్యాపారులు బయట మార్కెట్లో రూ.800 వరకు విక్రయిస్తారని వాపోతున్నారు. గతేడాది ఇదే సీజన్లో ఒక్కో కావిడి రూ.500 వరకు అమ్మేవారమని ఇప్పుడు ధరలు పడిపోయాయని తెలిపారు. హడ్డుబంగి, సోమగండి, గొయిది , శంభాం, కుశిమి, పెదరామ తదితర పంచాయతీల పరిధిలో పుల్ల దబ్బ పంట ఎక్కువగా పండుతుంది.

మైదాన ప్రాంతాల్లో డిమాండ్..

సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఏజెన్సీలోని సంతల్లో ఒక్కో పండు అర్థరూపాయికి సరాసరి కారు చౌకగా కొనుగోలు చేసే వ్యాపారులు పట్టణాల్లో ఒక్కొటి రూ.5 వరకు విక్రయిస్తూ లాభాలను ఆర్జిస్తారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి దబ్బ పంటను కొనుగోలు చేస్తారు. వాటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఎక్కువగా ఇవి పచ్చళ్ల తయారు చేసే చిన్నతరహా కంపెనీలకు విక్రయిస్తామని వ్యాపారులు గిరిజన రైతులకు చెప్పి సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరలకు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాల్లో గిరిజనులు ముందుగా దళారీ వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటారు. పంట పక్వానికి వచ్చే సమయంలో ఆ పంటను వ్యాపారులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా కూడా గిరిజనులకు నష్టాలు తప్పడం లేదు.

శ్రమకు తగ్గ ఫలితం లేదు

పైనాపిల్, సీతాఫలం తర్వాత ఆదాయాన్ని ఇచ్చేది దబ్బ పంట. శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. కావిళ్లు మోసుకుని తీసుకువస్తాం. తీరా వాటిని తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తుంది. ప్రత్యేక మద్దతు ధరలు లేవు. దీంతో వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్మకాలు చేస్తున్నాం. ఎస్.బాపయ్య, కారిమానుగూడ

మద్దతు ధర కల్పించాలి

దబ్బకు మద్దతు ధర ప్రకటించాలి. మద్దతు ధర లేకపోవడంతో అనేక నష్టాలు చవిచూస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. ఎస్.కోమటి, రాజన్నగూడ

వాటర్ ఫాల్స్‌లో ఎంబీబీఎస్ విద్యార్థిని గల్లంతు

బొబ్బిలి: పట్టణంలోని రావు వారి వీధికి చెందిన కొసిరెడ్డి (ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థిని) సౌమ్య అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వాటర్ ఫాల్స్‌లో ప్రమాదవశాత్తు గల్లంతయింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరులోని ఆశ్రమ్ వైద్య కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు(నలుగురు విద్యార్థినులు, ఒక విద్యార్థి) ఆదివారం సెలవు కావడంతో మారేడుమిల్లిలోని జలతరంగిణి వాటర్ ఫాల్స్‌కు వెళ్లారు.అక్కడ వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో వారంతా వాటర్ ఫాల్స్‌లో కొట్టుకుపోతుండగా ఇద్దరిని స్థానికులు రక్షించారు. మిగతా ముగ్గురు గల్లంతయ్యారు. సాయంత్రం వరకూ గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినప్పటికీ చీకటి పడటంతో పోలీసులు గాలింపు చర్యలు నిలిపివేశారు. ఆదివారం రాత్రి విషయం తెలుసుకున్న సౌమ్య కుటుంబసభ్యులు, స్థానిక వార్డు నాయకుడు బొత్స అప్పలు, సూరిబాబు తదితరులు హుటాహుటిన బొబ్బిలి నుంచి మారేడుమిల్లికి బయల్దేరారు. కొసిరెడ్డి అప్పలనాయుడు, రమలకు ముగ్గురు పిల్లలు కాగా పెద్దమ్మాయి జ్యోత్స్న ఇంటి వద్దనే ఉంటోంది. సౌమ్య తమ్ముడు సాయి ఇంజినీరింగ్ చదువుతున్నాడు.

బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి

- 20 మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేట గ్రామంలో అనధికారంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌పై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా మద్యంషాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం




స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు పవన్ ఆచార్యులు

విజయనగరం టౌన్: స్థానిక మెయిన్ రోడ్డు సంతపేటలో కొలువైన అతిపురాతన శ్రీ జగన్నాథస్వామి ఆలయంలో శ్రీ భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం కార్యక్రమాలు ఆదివారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు పవన్ ఆచార్యులు సంప్రదాయరీతిలో స్వామివారికి పూజాదికాలు నిర్వహించారు.

సాయంత్రం శ్రీలక్ష్మీనారాయణ కల్యాణోత్సవం చేశారు. ఏడురోజుల పాటు ఉదయం హోమ కార్యక్రమాలు, సాయంత్రం స్వామివారి విశేష కల్యాణాలు, ప్రవచనాలు ఉంటాయని, భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని అర్చకుడు కోరారు.

సాహిత్యానికి సరైన విమర్శ అవసరం



డమరుధ్వని-ప్రతిధ్వని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్య అకాడమీ సలహాబోర్డు సభ్యులు చింతకింది శ్రీనివాస్ తదితరులు

రాజాం సిటీ: ఉత్తమ విమర్శకులు చేసే విమర్శ సాహిత్యాన్ని సరైన మార్గంలో నడిపిస్తుందని తానా నవలా బహుమతి గ్రహీత, సాహిత్య అకాడమి సలహా బోర్డు సభ్యుడు చింతకింది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో పిల్లా తిరుపతిరావు రచించిన 'డమరుధ్వని – ప్రతిధ్వని' అనే విశ్లేషణాత్మక గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు ఏది రాసినా దానిపై సద్విమర్శకుడు చేసిన విమర్శ ఆ సాహిత్యానిక గీటురాయి అన్నారు. కవులు, రచయితలు విమర్శలను సహృదయంతో స్వీకరించినప్పుడే మంచి సాహిత్యం తెలుగులో వెలువడుతుందని ఆయన పేర్కొన్నారు. సాహితీవేత్తలు సమాజాన్ని బాగా చదవాలని, సామాజికమైన అంశాలే శాశ్వతత్వాన్ని పొందుతాయని అన్నారు. అనంతరం పుస్తక రచయిత తిరుపతిరావును వేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. వేదిక నిర్వాహకులు గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ ఆల్తి మోహనరావు పుస్తక పరిచయం చేయగా సీరపాణి, దుప్పల రవికుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ గార రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో 5డి థియేటర్

- ఆడలి వ్యూ పాయింట్, రెస్టారెంట్ 27న ప్రారంభం
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 27వ తేదీ న సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో 5డి థియేటర్‌ను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధి కారులతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా జరగాలని ఆదేశించారు. ఆడలి వద్ద ఫుడ్‌కోర్టులు, వివిధ స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆడలి వెళ్లే మా ర్గంలో సవర కళలతో కూడిన స్వాగత తోరణాలతో పాటు, గిరిజన సంస్కృతి, పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటక అభివృద్ధికి సూచికగా వివిధ కళా రూపాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్ప ప్రదర్శన, శాండ్ ఆర్ట్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అంశంలో పర్యాటక అభివృద్ధికి బాటలు వేసే విధంగా ఉండాలని స్పష్టం చేశారు.

ఏర్పాట్లు పక్కాగా చేయాలి

ఆడలి వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున మధ్యాహ్నం మూడు గంటలకు సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటక వేడుకలకు ఏర్పాట్లు పక్కాగా చేయాలని చెప్పారు. సభాస్థలి వద్ద గిరిజన సాంస్కృతిక కళా ప్రదర్శనలు, సవర డ్యాన్స్ వంటి నృత్య కళా ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు. వేడుకల వద్ద గేమ్ జోన్‌తో పాటు చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలతో ప్రత్యేక ప్రదేశాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, సహాయ ప్రాజెక్టు అధికారి జి.చినబాబు, పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.అన్నాదొర, గిరి జన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ సింహాచలం, డీఈఓ జి.పగడాలమ్మ పాల్గొన్నారు.